నరబలి అంటే ఏమిటని అడిగిన రాజు దాని అర్థం తెలుసుకున్నాడా?

సీతా సత్య

కథ

# దేవుడే చచ్చిపోయాడు

"బలి అంటే ఏంట్రా?" అని అడిగాడు రాజు.

ఒక్క క్షణం ఆలోచించి అన్నాడు శీను. "మనూళ్ళో ఉగాది పండక్కి అమ్మవారి గుడి ముందు మేకపోతుల్ని, కోళ్ళనూ కత్తితో చంపేస్తారు చూడు దాన్నే బలంటారా"

వాళ్ళిద్దరూ ఊళ్ళోని ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నారు. ఆ ఊరికి మకుటంలేని మహారాజుగా చలామణీ అవుతున్న రంగరాజుగారి అబ్బాయి రాజు. తరతరాలుగా పౌరోహిత్యాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తోన్న వంశంలో పుట్టాడు శీను. అతడి తండ్రి చుట్టుపక్కల ఊళ్ళల్లోనూ, ఆ ఊళ్ళోనూ పౌరోహిత్యం చేస్తాడు.

'ఇంకా అక్కడక్కడా పౌరోహిత్యం చేసే వాళ్ళు లోకంలో బతికే ఉన్నారు సుమా!' అని లోకానికి తెలియజెప్పడం కోసమే తమ పౌరోహిత్యం చేస్తున్నానా? అనిపిస్తోంటుంది అతనికప్పుడప్పుడూ. తన తండ్రిగారి రోజుల్లో పౌరోహిత్యం చేసేవారికి లభించిన గౌరవంలో లేశమాత్రమైనా ఈ రోజుల్లో లభించకపోవడాన్ని కూడా యుగధర్మాల్లో ఒకటిగానే భావించి రోజులు వెళ్ళదీయడం అలవాటు చేసుకున్నాడాయన.

'అయ్యా పంతులుగారూ వచ్చారా? ఇలా విచ్చేయండి. మీ కోసమే ఎదురు చూస్తున్నాం' అని మర్యాదగా పిలిచేవారు తన తండ్రిగారి కాలంలో. మరిప్పుడో? 'ఏవోయ్ పంతులూ, పొద్దున్ననగా వూరెడితే ఇప్పుడా రావడం? ఏం చూసుకునయ్యా అంత కండకావరం? మాకు నోరు తిరగని



అక్షరముక్కలేవో నాలుగొచ్చునవేగా మీ. మిడిసిపాటు!

నాకొళ్ళు మండిందంటే ఈ ఊళ్ళోనే కాదు, చుట్టు పక్కల మరెక్కడా మంత్ర ముక్కలు చెప్పుకోనీయకుండా చేయగల్ను. ఏవనుకుంటున్నావో. మా బామ్మర్ది ఈ మధ్యనే అన్నాడు కూడా. వాళ్ళూళ్ళో ఓ బాపనాయన, "నాలుగూళ్ళు చూపించండి

బాబూ మీ పేరు చెప్పుకుని పిల్లల కింత తిండి పెట్టుకుంటామ'' అన్నాట్ట. ఈ సారి మళ్ళీ ఇలా పొద్దెక్కాక వచ్చావంటే అంతే సంగతి మరి! తర్వాతేడ్చి లాభం లేదు అని కసురుకునేవాళ్ళే ఎక్కువ.

మరికొంతమంది తెలివైన వాళ్ళు "అసలీ పూజలూ వ్రతాలూ కర్మకాండలూ, ఇవన్నీ బాపనోళ్ళు బ్రతకడం కోసం కల్పించినవి. మనం వాళ్ళు చెప్పినవన్నీ నమ్మి ఉన్నదంతా తగలేసుకుని వాళ్ళను పోషిస్తున్నాం'' అనడం కూడా విన్నాడాయన.

తన మిత్రుడు శీను చెప్పింది విని "ఎందుకురా వాట్నలా చంపడం? అలా చంపితే పాపం వాటికి నొప్పికదరా?'' అన్నాడు రాజు జాలిగా.

"నొప్పిరా పాపం, కానీ వాటిని చంపుతామని మొక్కుకుంటారుకదా మరి, అందుకే వాటిని చంపేస్తారు'' అన్నాడు శీను.

"మొక్కు అంటే వంట్లో బాగోనపుడు దేవుడికి దణ్ణం పెట్టుకుని, 'దేవుడూ నాకు జ్వరం తగ్గితే నీ హుండీలో పావలా వేస్తాన'ని అనుకోవడమేకదరా?'' అన్నాడు రాజు.

"అవున్రా, మనం చిన్న పిల్లలం కనుక పావలాయో, అర్థరూపాయో హుండీలో వేస్తామని మొక్కుకుంటాం. పెద్ద వాళ్ళయితే వాళ్ళ దగ్గర బోల్డు డబ్బుంటుంది కనుక ఎక్కువ డబ్బు ఇస్తామని మొక్కుకుంటారు అదే మన అమ్మలైతే బంగారం ఇస్తామని మొక్కుకుంటారు. అక్కలైతే చీరా, రవికా, పసుపూ, కుంకం ఇస్తామని మొక్కుకుంటారు'' అన్నాడు శీను ఆరిందాగా.

"డబ్బులో, బంగారమో, చీరలో అయితే ఫర్వాలేదురా, కానీ పాపం మేకల్నెందుకురా చంపడం? జీవహింస మహా పాపమని మన మాష్టారు చెప్పలేదూ?'' అన్నాడు రాజు.

"ఈ పెద్దాళ్ళకు ఓసారి మాష్టరుగారితో చెప్పిస్తే ఎంత బావుంటుంది? పాపం వాళ్ళకు తెలియక అలా చేస్తున్నారేమోరా?'' అన్నాడు శీను.

ఇంటర్వెల్‌లో వాళ్ళిద్దరూ క్లాస్ రూమ్‌లో కూర్చుని మాట్లాడుకుంటున్నారు. వారిద్దరి సంభాషణా వెనుకనుంచి విన్న రామచంద్రం మాష్టారి కనులుచెమర్చాయి.

'ఈ పిల్లల మాటలెంత బాగున్నాయి వినేందుకు?'' అనుకున్నారాయన.

ఆయన్ను చూసి ఇద్దరూ మాట్లాడుకోవడం ఆపుచేసి "మాష్టారూ...'' అంటూ ఏదో చెప్పబోయారు.

"నేనంత విన్నాన్రా. జీవహింస మహాపాపమని పెద్దవాళ్ళందరికీ తెలుసు. కానీ మీకున్న ఇంగిత జ్ఞానం మాత్రం వారికి లేదురా. అందుకే దేవుడికి జంతువుల్ని బలిస్తామని మొక్కుకుంటారు'' అన్నారాయన.

"దేవుడంటే ఎవరికీ కష్టం కలక్కుండా ఎప్పుడూ కాపాడేవాడు కదా? మరైతేమనుషులు మేకల్ని, కోళ్ళని చంపుతోంటే ఎందుకూరుకుంటున్నాడు? దేవుడికి వాటికంటే మనుషులంటేనే ఎక్కువ ఇష్టమా మాష్టారు?'' అన్నాడు రాజు.

"దేవుడికి సృష్టిలోని ప్రతి ప్రాణి మీదా సమానమైన ప్రేమ ఉంటుంది. జంతువుల్ని బలిస్తే ఏ దేవత, దేవుడు సంతోషించ

రు. ఇవన్నీ బుద్ధిహీనులైన మనుషులు ఏర్పరచుకున్న శాస్త్రాలు'' అన్నారు రామచంద్రం మాష్టారు.

''అయితే మా నాన్నకసలు బుద్ధి లేదన్న మాట'' అన్నాడు రాజు కోపంగా. రామచంద్రం మాష్టారు ఉలిక్కి పడ్డారు.

''ఏమిటీ బాబూ ఏమంటున్నావు నువ్వు? నాన్నగారికి బుద్ధిలేదంటున్నావా? తప్పుకదూ? పెద్దల్నలా తిట్టొచ్చా?'' అన్నారాయన మందలింపుగా.

''అవును మాష్టారూ, మా నాన్నకు నిజంగానే బుద్ధి లేదు. నిన్న మా నాన్నగారు బుర్ర మీసాల సాంబయ్యతో మాట్లాడుతుండగా విన్నాను. ఈ ఏడాది ఉగాది పండుగ గొప్పగా చేయాలని సాంబయ్యతో అంటూండగా విన్నాను. వాళ్ళ మాటల మధ్యలో నరబలి అనే పదం కూడా విన్నాను. నరబలి అంటే ఏమిటీ మాష్టారూ?'' అని అడిగాడు రాజు.

రామచంద్రం మాష్టారు అదిరిపడ్డారు రాజు మాటలకు. ''ఏమిటీ, నువ్వు సరిగా విన్నావా? నరబలా? సరిగా గుర్తు చేసుకో'' అన్నారాయన ఆత్రుతగా.

''నిజం మాష్టారూ, వాళ్ళిద్దరూ మామూలుగా గట్టిగా మాట్లాడుకోలేదు. గుసగుసగా మాట్లాడుకున్నారు, నాకు వినబడకూడదని కాబోలు. నేనాగదిలోనే లెక్కలు హోమ్ వర్క్ చేసుకుంటున్నాను. అయినా వాళ్ళు మాట్లాడుకున్నవన్నీ విన్నాను. అమ్మవారి గుడి ముందు దున్నపోతును బలిస్తారట ఈసారి. అంతేకాకుండా నరబలి ఎవరికీ తెలియకుండా ఇవ్వాలని కూడా అన్నారు మా నాన్నగారు.

అప్పుడేవాళ్ళను 'నరబలంటే ఏమిట'ని అడుగుదామనుకున్నాను. కానీ నేనెప్పుడేవడిగినా 'నీ మాష్టార్నడగరా' అంటారు మా నాన్నగారు. అందుకే ఆయన్నేమీ అడగలేదు

శీనుగాడిక్కూడా అంత పెద్ద పదానికి అర్థం తెలియదని 'బలి' అంటే ఏమిటని మాత్రమే అడిగాడు వాణ్ణి. మీకు తెల్సు



కదా మాష్టారు చెప్పరూ నరబలంటే ఏవిటో'' అన్నాడు రాజుఅమాయకంగా.

రాజు మాటలు పూర్తిగా విన్నాక నోట మాట రాలేదు మాష్టారికి. రాజు చెప్పేదే నిజమైతే...? వళ్ళంతా చెమటలు పట్టాయి ఆయనకు. కాళ్ళూ, చేతులూ సన్నగా కంపించడం ప్రారంభించాయి. ఆయనేదో అనబోతూండగా బెల్ మ్రోగింది. బయట కు ఆటలకు వెళ్ళిన పిల్లలంతా బిలబిలా లోపలకు రావడం ప్రారంభించారు.

''తర్వాత చెప్తాను రాజూ. శీనూ నువ్వు కూడా ఈ మాట ఎక్కడా అనకేం?'' అన్నారాయన.

తను చెప్పిన విషయం విన్నాక మాష్టారి మొహం అదోలాగైపోవడం, ఆయన కంగారు

గా అటూ ఇటూ చూడడం ఇద్దరూ గమనించారు. అదేదో ప్రమాదకరమైన విషయమని మాత్రం అనిపించింది ఇద్దరికీ.

''మా నాన్నగారి నడగమంటూమేమి రా?'' అన్నాడు శీను గుసగుసగా. ''వద్దులే రా, మాష్టారు తర్వాత చెబుతానన్నారుగా'' అంటూపుస్తకాలు తీశాడు రాజు.

బడి వదిలిన తర్వాత ఇంటికి బయల్దేరా రు రామచంద్రం మాష్టారు. నడుస్తున్నారేగా నీ రాజు చెప్పిన మాటలాయన తలలో తిరుగుతున్నాయి. రాజు తండ్రి రంగరాజుగా రు గుర్తొచ్చారాయనకి. ఆయన మాటకా ఊళ్ళో ఎదురులేదు. ఊళ్ళో ఉన్న పంట భూముల్లో సగం ఆయనవే. పంట భూము లు కాక, యాభై ఎకరాల కొబ్బరితోటా, ఎనభై ఎకరాల మామిడి తోటా ఆయనకు పూర్వీకుల నుంచి సంక్రమించాయి. తన పలుకుబడిని, తెలివితేటల్ని ఉపయోగించి భూపరిమితి చట్టాన్ని తన దరిదాపులకు రాకుండా చేసుకున్నారాయన.

ఇవిగాక దగ్గర్లో ఉన్న పట్టణంలో రెండు సినిమా థియేటర్లు,ఒక ఐస్ ఫ్యాక్టరీ, ఒక రైస్ మిల్లు కూడా ఆయన అధీనంలోనేఉ న్నాయి. ఇటీవల చుట్టు పక్కల ఉన్న పట్టణాల నానుకుని ఉన్న పంట భూముల్ని చవగ్గా కొని, వాటిని ప్లాట్లు ఇళ్ళ స్థలాలుగా మార్చి అమ్మే వ్యాపారం కూడా చేపట్టాడా యన. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన పట్టిందల్లా బంగారమైంది.

ఆయన దయకు నోచుకున్న ప్రతివా డూ అంతో ఇంతో ఎదిగాడు. ఆయన్నుకాద ని ఎదురు తిరిగిన వాళ్ళు ఆనవాళ్ళు కూడా దొరక్కుండాపోయారు. ఏటా ఉగాది పం డుగ సందర్భంగా నిర్వహించే అమ్మవారి ఉత్సవాలు ఆయన ఆధ్వర్యంలోనే జరుగుతా యి. జంతుబలుల్ని ప్రభుత్వం నిషేధించినా ఈ నాటికీ అవింకా జరుగుతూనే ఉన్నాయి.

శతాబ్దాల క్రితం అక్కడక్కడా నరబలు లు చేసేవారని అనుకోవడమే తప్ప ఇటీవలి కాలంలో అటువంటివి ఎక్కడా జరిగిన దాఖలాలు లేవు. ఒక వేళ ఉన్నా, జనవాసాల కు దూరంగా దట్టమైన అడవుల్లోనివసించే ఏ కొండ జాతి వారికో పరిమితమై ఉండొచ్చు. కానీ నభ్య సమాజంలో నాగరికు లమధ్య జీవిస్తూ ఈయన నరబలి గురించి ఆలోచిస్తున్నాడంటే అంతకంటే ఘోరాతి

ఘోరం మరకటి ఉండబోదు.

రంగరాజుతలుచుకుంటే ఒక్క మనిషినే కాదు, వందలకొద్దీ మనుషుల్ని ఆనవాలు లేకుండా చేయగలడు. కనుసైగతో ఎంతటి క్రూరమైన పనైనా చిటికెలో చేసే బలం అతడికుంది. రాజు చెప్పిందే నిజమైతే ఏదోకొత్త ప్రణాళిక ప్రారంభించేందుగ్గాను అతడీ ఘాతుకానికి పూనుకుని ఉండొచ్చు. ఇది ఆపడమెలా? అతడి పనికెవరైనా అడ్డుస్తున్నారని తెలియనక్కర్లేదు. అనుమానం వస్తే చాలు, అతనలివాడి ఆయువు మూడినట్టే. చట్టమన్నా, పోలీసు వ్యవస్థాన్నా అతడికి లెక్కలేదు. ఎలా? ఏం చేసి ఈ ఘోరాన్ని జరక్కుండా ఆపాలి? ఇంటికి చేరుకున్నా అదే విషయం ఆలోచిస్తూ గడిపారాయన.

***

మర్నాడు రోజుకంటే ముందుగా స్కూలుకు చేరుకున్నారాయన. ఆయనకంటే ముందుగానే అక్కడికి వచ్చిన రాజు, ఆయన్ను చూడగానే దూరంనుంచి పరుగునవచ్చి "మీరు చెప్పకుండానే నాకు తెలిసిపోయింది మాష్టారు నరబలి అంటే మనిషిని చంపేయడం కదా!' నాకు ఏడుపొస్తోంది మాష్టారు, మా నాన్నగారు ఎవర్ని చంపుతారోనని నాకుభయంగా ఉంది మాష్టారు..." అంటూ వెక్కెక్కి ఏడవడం ప్రారంభించాడు.

వాణ్ణి సముదాయించడం చాలా కష్టమైపోయింది రామచంద్రం మాష్టారికి. "ఊరుకో బాబూ, నువ్వేడిస్తే అందరికీ ఈ విషయం తెలుస్తుంది. అందరికీ తెలిసిపోతే మీ నాన్నగారికోపం వస్తుంది. అప్పుడు నిజంగానే ఎవర్నో నరబలి ఇచ్చేస్తారు. ఏమీ తెలియనట్టుగా నువ్వు మౌనంగా ఉన్నావనుకో! మనం ఏదో ఉపాయం ఆలోచించి ఇది జరక్కుండా చూడొచ్చు" అన్నారాయన.

మాష్టారి మాటలు విన్న రాజు మొహంలో ఆనందం తాండవమాడింది. "నిజంగా నా మాష్టారూ?! మీరెంత మంచివారు! ఉపాయంతో దీన్ని జరక్కుండా ఆపొచ్చునా? అందుకు మనమేం చేయాలి మాష్టారూ?" అన్నాడు రాజు ఛాతీ ఎగరేసి.



## ఆయన

"మా ఆయన ధర్మరాజులాంటివారు!"
"అలాగా. నువ్వెంత అదృష్టవంతురాలివే సుధా—"
"అదృష్టమా నా బొందా?
జూదంలో ఆస్తంతా తగలేస్తుంటే..."

సి. శ్రీనివాసమూర్తి (హిందూపురం)

వాడిని మరిపించడానికి మాటంటే ఇచ్చారుగానీ ఏం ఉపాయం పన్నాలో ఆయనకూ తోచలేదాక్షణంలో. అయినా వాణ్ణి సముదాయించేందుకు "ఓ... ఉపాయం లేకే తప్పకుండా ఉంది. నేను ఆలోచించి ఏం చేయాలో చెపుతానుగా. నువ్వు మాత్రం మీ ఇంట్లో జరిగే విషయాలు ఎప్పటికప్పుడు నాకు చెపుతూండు. తర్వాతి పనంతా నేను చూసుకుంటాను సరేనా?" అన్నారు.

"అలాగే మాష్టారూ" అంటూ క్లాస్ రూమ్‌లోకి దారితీశాడు రాజు. ఆ రోజంతా అన్యమనస్కంగానే గడిచిందాయనకు.

మర్నాడు రాజు బడికి రాగానే మాష్టారి కోసం చూశాడు. అప్పటికే ఆయన వాడికోసం ఎదురు చూస్తున్నారు. మాష్టార్ని చూడగానే వాడి ఛాతీ ఎగిసిపడింది.

పరుగున ఆయన దగ్గరకువెళ్ళి "నిన్న మళ్ళీ సాంబయ్య మా ఇంటికి వచ్చాడు మాష్టారూ. సాంబయ్య ఏదో చెప్పబోతే నాన్నగారు వాడ్ని కసిరి బయటకు నడవమని సైగ చేసి ఆయన కూడా ఇంట్లోంచి బయటకు వెళ్ళారు. జాజి పందిరి దగ్గరున్న ఉయ్యాల బల్ల దగ్గరకెళ్ళారు ఇద్దరూ. నేను నెమ్మదిగా చప్పుడు చేయకుండా నడిచి వెళ్ళి ఆ పక్కనే ఉన్న మందార పొద చాటున నక్కి నిలబడ్డాను మాష్టారు.

నేనెక్కడికి వెళ్ళముందు సాంబయ్యగాడు ఏదో చెప్పినట్టున్నాడు నాన్నగారు 'సర్లే సర్లే... వాణ్ణి తీసుకురావడంలో మాత్రం తేడా రాకూడదు. జాగ్రత్త!' అన్నారు. నాకెంతో భయమేసింది మాష్టారూ. మామిడితోటలో క్రొత్తగా ఏదో ఫ్యాక్టరీ కడతారట మాష్టారూ. రేపట్నుంచి పునాదులు తవ్వించమని చెప్పారు నాన్నగారు సాంబయ్యతో" అన్నాడు రాజు.

మనసులో దాచుకున్న మాటల్ని పైకి చెప్పేశాక వాడి మొహం తేట పడింది. వాడి మాటలు విన్నాక రామచంద్రం మాష్టారికి దిగులెక్కువైంది. తనుచెప్పింది విన్న తరువాత ఆయన తనను మెచ్చుకుంటారని ఆశించిన వాడికి ఆశాభంగం కలిగింది. దిగులుగా ఉన్న మాష్టారి మొహం చూసి.

"ఎందుకు మాష్టారూ అలా ఉన్నారు? మీ దగ్గర ఉపాయం ఉందిగా?" అన్నాడు రాజు అమాయకంగా.

వాడికేం చెప్పాలో తెలియక దీర్ఘంగా నిట్టూర్చారాయన. నేనూ నీలా పసివాడినై ఉంటే ఎంత బాగుండేదిరా, బాధ్యతను పెద్దవారి మీద వేసి నిశ్చింతగా ఉండేవాణ్ణి అనుకున్నారాయన వాడివైపు చూస్తూ.

"చెప్పండి మాష్టారూ, మీ దగ్గర నిజంగా ఉపాయం ఉంది కదా?!" అన్నాడు రాజు తిరిగి. తను అడిగిందానికి మాష్టారికేమీ సమాధానం చెప్పకపోవడంతో వాడికి అనుమానం వచ్చింది. నిజంగా మాష్టారి దగ్గర ఉపాయం ఉందా? లేకపోతే తను ఏదైనా కావాలని మారాం చేసినపుడు బామ్మ అమ్మ ఏవో కబుర్లు చెప్పి మభ్యపెట్టినట్టుగా ఈయనా చేస్తున్నారా? అనిపించింది వాడికి.

"లేదురా నిజంగానే ఉపాయం ఉంది. నువ్వు మాత్రం ఈ మాటెక్కడా అనకు" అన్నారాయన.


''మీరన్నిసార్లు చెప్పక్కర్లేదు మాస్టారూ నిజంగానే నేనెవరితోనూ చెప్పను. నా మీద ఒట్టు'' అన్నాడు రాజు అభయమిస్తున్నట్టుగా నెత్తిమీద కుడి చేయి ఉంచుకుని. మాస్టారు చటుక్కున వాడి తలమీదనుంచి చేయి తీసి పరేలేరా ఒక వేళ మర్చిపోయి ఎవరితోనైనా అంటావేమోనని చెప్పాను. నువ్వు మంచి కుర్రాడివనీ, మాస్టారి మాట జవదాటవనీ నాకు తెలియదూ?'' అంటూ వాడిని దగ్గరకు తీసుకుని ప్రేమగా వాడి తల నిమిరారాయన.

మర్నాడు ఉగాదనగా ఆ రాత్రి రాజు మాస్టారింటికి పరుగెత్తుకుని వచ్చాడు. అప్పు డాయన భోజనం చేసి వాలుకుర్చీలో కూర్చు ని ఆలోచిస్తున్నారు. వాణ్ణి చూడగానే ఆయనను తిరిగి దిగులావహించింది మళ్ళీ ఏం కబురు మోసుకొచ్చాడోనని.

ఆయన ఊహించినట్టుగానేవాడింకా దగ్గ రకు రాకుండానే ''మాస్టారూ... మాస్టారూ '' అన్నాడు. బయట వాతావరణం చల్లగా ఉన్నా వాడి మొహం నిండా చిరుచెమట అలుముకుని ఉంది. పరుగెత్తుకొచ్చిన ఆ యాసంవల్ల కాబోలు ఎగశ్వాస పీలుస్తున్నాడు

''ఏమైంది రాజూ భయపడకు ఇలారా'' అంటూ ప్రేమగా పిలిచారాయన. ''మరే మాస్టారూ సాంబయ్యగాడు ఇందాకిందాకే ఓ గోనెమూట మోసుకొచ్చాడు మా ఇంటికి. పెరటి గుమ్మంలోంచి వచ్చాడు వాడు. సరాసరి వాడు మా ధాన్యం గదుల దగ్గరకెళ్ళాడు. ఆ మూట పక్కదదించి ఇంట్లోకి వెళ్ళాడు మా నాన్నగార్ని పిలిచేం దుకు. అప్పుడు నేను ఆ మూట దగ్గరకెళ్ళి చూశాను. లోపల్నించి మూలుగులు వినిపిం చడంతో నాకు భయమేసింది మాస్టారు. వెంటనేమీ దగ్గరకు పరుగెత్తుకుని వచ్చాను. సాంబయ్యగాడు ఎవర్నో చంపేసి ఆ గోనెసంచిలో వేసి కట్టాడేమో మాస్టారు'' అం టూ ఏడుపు అందుకున్నాడు రాజు.

వాడు చెప్పింది విన్న రామచంద్రం మాస్టారికి గుండె జల్లుమంది! మర్నాడు మామిడి తోటలో బలిచ్చేందుకు ఎవర్నో



# అలాగా!

సత్యవతి కోపంగా అడిగింది ఓనర్ని—
''ఎన్నిసార్లు చెప్పాలండి? వర్షానికి ఇల్లంతా కురుస్తోంది. మేమంతా స్నానమైపోతున్నాం. ఏం చేయదలచుకున్నారో చెప్పండి''
''మీ బాధ నాకర్థమైందమ్మా. రేపు మీ కోసం ఓ తువ్వాల సబ్బు తెప్పించి ఇస్తానండి-'' తాపీగా చెప్పాడు.

—సిరిసిల్లా రశీద్ శషక్ (బీబీపేట్)

తీసుకువచ్చారన్నమాట. గోనె సంచిలో వేసి కట్టారంటే బహుశా ఏ చిన్న కుర్రాడో అయి ఉంటాడు. ఇహ తను తాత్సారం చేయకూడదు. తన ప్రాణం పోయినా సరే ఆ కుర్రాణ్ణి రక్షించాలి. ఒక ధృఢ నిశ్చయాని కి వచ్చాక ఆయన మనసు తేలిక పడింది. క్షణాల్లో తన నిర్ణయం ఆయనకెంతో మానసి క శక్తిని సమకూర్చింది.

తనను తాను సంబాషించుకుంటూ అన్నారాయన. "ఏకేం భయం లేదు రాజు, నువ్వింటికెళ్ళి హాయిగా పడుకో సాంబయ్య తీసుకొచ్చిన మనిషిని రక్షించే బాధ్యత నాది. నా దగ్గరఉపాయం ఉందన్నానుగా నువ్వేం దిగులు పడకుండా ఇంటికెళ్ళు.

"అలాగేమాష్టారూ... ఆలస్యం చేస్తే మళ్ళీ నేనెక్కడికి వెళ్ళానో అని అందరికీ అనుమానం వస్తుంది. నేను వస్తాను మాష్టా రూ" అంటూ వెనక్కు తిరిగి రివ్వున దూసుకుపోయాడు రాజు.

వాడువెళ్ళాక ఆలస్యం చేయలేదు మాష్టా రు. ఇంట్లో ఉన్న భార్యను పిలిచి "పనిమీద బయటకు వెళ్తున్నాను" అని చెప్పి చెప్పులు తొడుక్కుని ఉత్తరీయం భుజంమీద వేసుకు ని బయలుదేరారాయన.

"ఇంత రాత్రివేళ ఎక్కడికండీ!?"అం దావిడ.

అప్పటికే ఆయన ఇంటి ఆవరణ దాటారు. ఆయన వీధి మలుపు తిరిగిన రెండు నిముషాలకు శీను తండ్రి రామశర్మ ఆయనింటికి వచ్చాడు.

ఆ ఊరికి ఇరవై రెండు కిలో మీటర్ల దూరంలోనే ఉంది పట్టణం. పగలు ఒకటీ, అరా బస్సులు ఆ ఊరికి వచ్చినా రాత్రిపూట ప్రయాణం చేయడానికి ఏ విధమైన వాహనమూ దొరకదు. ఆ ఊర్నించి ఫోన్ సౌకర్యం లేదు. రోడ్డుమీదకు వెళ్ళి సైకిల్ అద్దెకు తీసుకున్నారాయన.

సైకిలు షాపువాడు ఆశ్చర్యంగా చూస్తూ ఇంత రాత్రెక్కడికి మాష్టారూ?" అన్నాడు. ఎవరికీ సమాధానం చెప్పే స్థితిలో లేరాయన. మర్నాడు తెల్లవారు జామున జరగబోయే దారుణ ఘాతుకాన్ని ఆపాలి. అదొక్కటే ఆలోచన. ఆయన మనసులో. సైకిల్ మీద పట్టణం చేరుకునే సరికి రాత్రి పదకొండు గంటలైంది. సరాసరిపోలీస్ స్టేషన్‌కు వెళ్ళా రాయన.

స్టేషన్ వరండాలో ఉన్న కుర్చీలో కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు ఓ కానిస్టేబుల్. అతణ్ణి లేపి ఇన్స్పెక్టర్ గురించి అడిగారు. అతను ఓ పదినిమిషాలు వెటకారంగా మాట్లాడి చివరకు ఇంటి గుర్తులు చెప్పి వెళ్ళి కల్సుకోమన్నాడు.

"ఇదెంతో అర్జంటు విషయం ఫోన్ చేసి ఆయనకు చెప్పు బాబూ?" అన్నా వినలేదు ఆ కానిస్టేబుల్. మీకే మీరు బానేఉంటారు . అర్థరాత్రి లేపినందుకు రేపు మా తోలు తీస్తాడాయన" అన్నాడు.

చెప్పేదిలేక అతడు చెప్పిన గుర్తులననుస రించి ఇన్స్పెక్టర్‌గారింటికి వెళ్ళాడు. కాలిం గ్ బెల్ మోత విని తలుపుతీసిన వ్యక్తి ఇన్స్పెక్టర్ భార్యకాబోలు, "ఇన్స్పెక్టర్‌గా ర్ని కలుసుకోవాలని వచ్చాను" అన్న మాష్టారి మాటలు విని, మొహం చిట్లించి "లేరు" అని ఇంకా గొణుక్కుంటూ తలుపు ధడాల్న

వేసుకుంది.

నీరసం ఆవహించింది ఆయన్ని. మరోసారి కాలింగ్ బెల్ మోగించాడు. ఊహూ తలుపు తెరుచుకోలేదు. మూడోసారి, నాలుగోసారి మోగించి ప్రయోజనం కనబడక తలుపు దబదబా బాదారు.

తలుపు విసురుగా తెరిచి "వెధవ సంత, లేరని చెబుతుంటే నీక్కాదూ? మరోసారి తలుపు తట్టావంటే ఆయన్తో చెప్పి జైల్లో తోయిస్తాను" అంటూ తలుపేసుకుందావిడ ఆయన చెప్పబోయే మాటల్ని వినిపించుకోకుండా.

ఒక్క క్షణం ఆలస్యం చేయలేదు. సైకిల్ వెనక్కి తిప్పి పోలీస్ స్టేషన్‌కు పోనిచ్చారాయన. కునికిపాట్లు స్థితినుంచి గుర్రుపెట్టే స్థాయికి చేరుకున్నాడు కానిస్టేబుల్ ఆయన స్టేషన్‌కు వెళ్ళేసరికి.

అతణ్ణి లేపగానే కయ్‌మన్నాడతను. "ఎవరవయ్యా నువ్వు? బంగారం లాంటి నిద్ర పాడుచేశావు? పద నిన్ను సెల్‌లోకి తోసేస్తాను. అప్పుడుగానీ నాకు ప్రశాంతంగా నిద్ర పట్టదు" అన్నాడతడు కోపంగా.

మాస్టారు కిందికి వంగి అతని కాళ్ళు పట్టుకున్నారు: "బాబూ ఇన్స్పెక్టర్‌గారి దగ్గరకు నన్ను తీసుకెళ్ళకపోతే అన్యాయంగా ఒక మనిషి చచ్చిపోతాడు" అంటూ క్షుణ్ణంగా చెప్పారాయన.

కానిస్టేబుల్ మత్తు వదిలిపోయింది. "ఇంటి దగ్గర లేరా?" అంటూ గొణుక్కుని ఏదో గుర్తొచ్చినవాడిలా "ఆ .. టౌన్ హాల్లో ఏదో ఫంక్షనుందీ రోజు బహుశా అక్కడున్నారేమో" అన్నాడు.

కానిస్టేబుల్ మాటలు పూర్తికాకుండానే ఆయన సైకిలెక్కారు. టౌన్ హాలు చేరుకునే సరికి అంతా కోలాహలంగా ఉందక్కడ. ఆ జనం మధ్య ఇన్స్పెక్టర్‌ను వెతికి పట్టుకుని విషయం వివరించారాయన.

ఆయన చెప్పింది విన్నాక అన్నాడు



ఇన్స్పెక్టర్ "మీరు నిజమే చెప్తున్నారా? మీరు చెప్పేదాంట్లో ఏదైనా తేడా ఉంటే రేపటికి మీరూ నేనూ కూడా ఉండం"

ఆయన భరోసా ఇచ్చాక క్షణం కూడా ఆలస్యం చేయలేదు ఇన్స్పెక్టర్ అక్కణ్ణుంచి స్టేషన్కు ఫోన్ చేసి జీపు తెప్పించి మాస్టారి సైకిల్ని ఓ కానిస్టేబుల్కు వప్పజెప్పి నలుగురు కానిస్టేబుల్స్ను సిద్ధం చేయించి, ఆయనను తీసుకుని జీపులో బయలుదేరాడు.

అప్పటికి సమయం తెల్లవారుఝామున రెండు గంటలైంది. సరిగ్గా ముప్పయ్ రెండు నిముషాల్లో ఊరి పొలిమేరలకు చేరుకుంది జీపు.

"ఈపరికి వాళ్ళంతా అక్కడికి చేరుకొని ఉంటారేమో ఇన్స్పెక్టర్గారూ?" అన్నారు మాస్టారు. "చెప్పండి ఎటువెళ్ళాలో" అన్నాడు ఇన్స్పెక్టర్.

మామిడి తోటకు వెళ్ళే గుర్తులు చెప్పసాగారు మాస్టారు. ఒక కిలో మీటరు దూరం వెళ్ళాక తోటకు వెళ్ళే మట్టిరోడ్డు అంతమైంది.

"ఇక్కణ్ణించి ఓ ఫర్లాంగు దూరం నడిచి వెళ్ళాలి" అన్నారు మాస్టారు. జీపులోంచి ఇన్స్పెక్టరూ, నలుగురు కానిస్టేబుల్స్ దిగారు. మాస్టారు దారి చూపించగా వాళ్ళంతా ఆయన్ను అనుసరించారు.

* * *

మాస్టారి ఇంటినుంచి వచ్చిన తరువాత భోజనం చేసాడు రాజు. "నిద్రొస్తోందమ్మా, ఇవ్వాళ చదూకోను" అని చెప్పి తను పడుకునే గదిలోకి చేరుకుని, మంచంమీద పడుకుని కళ్ళు మూసుకున్నాడు రాజు. కాస్సేపటికి వాళ్ళమ్మ వచ్చి గదిలో లైటార్పి రాజు వంటిమీద దుప్పటి కప్పి వెళ్లిపోయింది.

ఓ అరగంట గడిచిన తర్వాత మెమ్మదిగా కళ్ళు తెరిచి దుప్పటి పక్కకు తప్పించాడు రాజు. గదంతా చీకటిగా వుంది. చప్పుడు చేయకుండా మంచం దిగి తలుపు తెరుచుకుని బయటకు నడిచాడు. హాలులో పడుకున్న బామ్మ చిటుక్కుమంటే లేస్తుందని తెలుసు వాడికి.

ఏ మాత్రం సవ్వడి చేయకుండా పెరటి తలుపు తెరచుకుని బయటకు నడిచాడు. ఆరోజు అమావాస్య కావడాన వాడి కళ్ళకేమీ కనిపించడంలేదు. పెరట్లో కొంచెం దూరంగా ఓవారగా ఉన్న ధాన్యపుగదుల దగ్గరకు తడుముకుంటూ నడిచాడు. కాస్సేపు అటూ ఇటూ తిరిగాక వాడి కాళ్ళకు ఏదో తగిలింది. చేతుల్తో తడిమి చూసాక అదే తను చూసిన గోనె మూట అని అర్థమైంది వాడికి.

ఈసారి అందులోంచి మూలుగులు వినబడడంలేదు. అందులో ఉన్న మనిషిని ఏం చేసారు? అందులో ఎవరూ లేకపోతే ఇంకా నిండుగా ఎందుకుందది? గోనెసంచి లోపలకు చేయి పెట్టాడు. వాడి చేతికి జుట్టు తగిలింది. లోపల ఎవరో ఉన్నారని తెలియగానే వాడి వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి. వెంటనే గోనెసంచి పూర్తిగా తప్పించాడు.

లోపలున్న మనిషిని చేతుల్తో తడిమి తనలాంటి కుర్రాడేనని గ్రహించాడు రాజు.

అంత చీకట్లోనూ అతడి కళ్ళకు మెరుస్తూ కనిపించిందో వస్తువు. దాన్ని చేత్తో పట్టుకుని లాగాడు. ఆ పెన్ తనదే! తనే శీనుగాడి పుట్టినరోజుకు దాన్ని బహుమతిగా ఇచ్చాడు. మొత్తమంతా స్టీల్‌తోనే చేయబడిందది. ఢిల్లీ మావయ్య తనకు బహుమతిగా ఇస్తే తను దాన్ని శీనుగాడికి ఇచ్చాడు. ఇవ్వాళ కూడా తను స్కూల్లో దాన్ని శీనుగాడి జేబులో చూసాడు. ఇప్పుడిది ఇక్కడికెలా వచ్చింది?

గోనె సంచి గోంచి తీసిన కుర్రాడి వళ్ళంతా తడిమాడు. కాస్సేపటికి వాడికేదు పొచ్చింది. వీడు శీనుగాడే! వీడి చేతికి ఆరు వేళ్ళున్నాయి. అంటే శీనుగాణ్ణే రేపు చంపేస్తారన్నమాట! పాపం వాడేం చేసాడు? వాళ్ళమ్మ, నాన్న ఎంత ఏడుస్తారో! శీనుగాడు చచ్చిపోతే తనతో రోజూ బడికి ఎవరొస్తారు? తనతో ఆడుకోడానికి ఎవరుంటారు? తనకు తెలియని విషయాలు ఎవరు చెపుతారు?

పాపం వాడికెంత బాధ కలుగుతుందో వాణ్ణే చంపేటప్పుడు! వాణ్ణే చంపనివ్వడు తను.

"ఒరే శీనూ... లేరా నిద్రపోతున్నావా? లే... ఇద్దరం పారిపోదాం. ఇక్కడుంటే నిన్ను చంపేస్తారు. నిన్ను చంపేస్తే నా కేడుపొస్తుంది. నేనీ ఇంట్లో ఉండను. నేనూ మీ ఇంటికి వచ్చేస్తాను" అని గుసగుసగా అన్నాడు రాజు వాడి చెవిలో.

ఊహూ వాడిలో చలనం లేదు. తను కొట్టిన దెబ్బలవల్ల వాడు బాధతో మూలుగుతున్నాడని, వాడికి మత్తు మందు ఇచ్చి తిరిగి గోనెసంచిలో ఉంచాడు సాంబయ్య. ఆ విషయం వాడి చిన్ని బుర్రకెలా తెలుస్తుంది? శీను కదలడం లేదేమిటి? చచ్చిపోయాడా? ఎలా తెల్సుకోడం?

వాడి బుర్రలో మెరుపులా ఓ ఆలోచన వచ్చింది. మనిషి బ్రతికి ఉన్నంతవరకూ పగలూ, రాత్రీ - నిద్రపోయినాకూడా శ్వాసక్రియ జరుగుతుందని చెప్పారు కదా మాస్టారు! శ్వాసక్రియ అంటే ముక్కులో గాలి పీల్చడమేకదా? చేతి వేళ్లను వాడి ముక్కు దగ్గరుంచాడు రాజు. గాలి వెచ్చగా తగిలింది వాడి చేతికి.



# అందుకని

"ఏమే బావా? జీవితాంతం పెళ్ళి చేసుకోకుండా ఉండిపోయావేం? ఇంటిలో [illegible]?"

"ఏం చేయనే పనిమనుషులెవరూ నిలకడగా ఉండటంలేదు. మరి ఇంటిపని, వంటపని ఎవరు చేస్తారు? అందుకనే పెళ్ళి చేసుకున్నా."

[illegible] శ్రీనివాసమూర్తి ([illegible])

హమ్మయ్య! శీనుగాడు బ్రతికే ఉన్నాడు! కాని ఎంత లేపినా లేవడేం? ఇంకాస్సేపైతే తెల్లారిపోతుంది. తెల్లారిపోతే వీణ్ణి తీసుకెళ్ళి బలిచ్చేస్తారు. అప్పుడు తనకెంతో ఏడుపొస్తుంది. తను చిన్న వాడు. ఆ సాంబయ్యగాణ్ణి ఏవీ చేయలేడు. తనే పెద్దాడై ఉంటే ఆ సాంబయ్యగాడి మీసాలు పీకి, వాడి మొహమంతా గుద్దులతో పచ్చడిచేసి ఉండేవాడు.

ఇప్పుడెలా? ఏడుపు తన్నుకొస్తోంది వాడికి. ఏడుస్తూనే వాణ్ణి గోనె సంచిలోంచి బయటకు లాగి, ధాన్యపు గదుల పక్కగా వాణ్ణి దాచి, తను ఆ సంచిలో కూర్చున్నాడు రాజు.

* * *

మామిడితోటలోకి ప్రవేశించారు ఇన్స్పెక్టరూ అతడి బలగమూ. చెవులు రిక్కించి వింటున్నారంతా. ఆ కారు చీకటిలో నిశ్శబ్దాన్ని చీలుస్తూ ఓ కేక వినబడింది అందరికీ.

ఆ దిక్కుగా పరుగెత్తారందరూ. వాళ్ళక్కడికి చేరుకునేసరికి టార్చి లైటు వెలుతుర్లో సాంబయ్య, రంగరాజూ పారిపోతూ కనిపించారు.

ఇన్స్పెక్టర్ గట్టిగా అరుస్తూ— "అక్కడే నిలబడండి. ఒక్కడుగు ముందుకు వేశారంటే చస్తారు" అంటూ పిస్టల్ గాల్లోకి పేల్చాడు.

మరో రెండు నిముషాల తర్వాత సాంబయ్యనూ, రంగరాజునూ పట్టుకుని పునాదులు తవ్విన చోటికి తీసుకొచ్చారు.

ఇన్స్పెక్టర్ పునాదుల్లోకి టార్చి ఫోకస్ చేసాడు. నాలుగడుగుల లోతున పునాదిలో తలా, మొండెమూ వేరుగా పడి ఉన్నాయి. మొండానికున్న బట్టల్ని చూసి మాస్టారు ఉలిక్కిపడ్డారు.

తన దగ్గరకు వచ్చినప్పుడు రాజు అవే బట్టల్ని వేసుకుని ఉన్నాడు. వళ్ళంతా ఉద్వేగం ఆవహించిందాయన్ను.

తెగి పడివున్న తలవైపు చూసి "రాజా! అంటూ బిగ్గరగా అరిచారాయన."

తల దించుకుని ఉన్న రంగరాజు ఆ అరుపునకు ఉలిక్కిపడి పునాదుల్లోకి చూసి అదిరిపడ్డాడు.

ఆ వెనువెంటనే "బాబూ" అంటూ పొలికేక పెట్టాడు రంగరాజు.

"నా దుర్మార్గానికి నువ్వు బలైపోయావా కన్నా?! నన్ను చంపేయండి, ముక్కలు ముక్కలుగా నరికి ఈ పునాదుల్లో పాతిపెట్టండి" అంటూ దిక్కులు పిక్కటిల్లిపోయేలా అరుస్తూ, నేలమీద పడి దొర్లుతూ హృదయవిదారకంగా ఏడ్వసాగాడు రంగరాజు.

'నరబలి అంటే ఏవిటి మాస్టారూ?' అని అమాయకంగా అడిగిన రాజు తనే బలైపోయాడనే వాస్తవాన్ని జీర్ణం చేసుకోలేక పోతున్నారు మాస్టారు. ఆయన మనసంతా వికలమైపోయింది. 'దేవుడంటే ఎవరికీ కష్టం కలక్కుండా కాపాడేవాడుకదా మాస్టారూ?' అన్న రాజు మాటలే ఆయన చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

"చచ్చిపోయింది రాజు కాదు, దేవుడు... దేవుడే చచ్చిపోయాడు... మూఢభక్తి, విశ్వాసాల చాటున జరుగుతోన్న ఇటువంటి ఘోరాల నాపలేని దేవుడే చచ్చిపోయాడు" అంటూ మతి చెడినవాడిలా బిగ్గరగా అరవసాగారు మాస్టారు.